క్లుప్తంగా

విద్యార్థులకు వర్క్ ఇంటర్న్‌షిప్


టైలరింగ్ శిక్షణలో పాల్గొన్న విద్యార్థులు

హిందూపురం టౌన్: మండల పరిధిలోని సీ.చెర్లోపల్లి ఏపీ మోడల్ స్కూల్‌లో పదో తరగతి, ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఒకేషనల్ కోర్సులు చదువుతున్న విద్యార్థులకు ఉపాధి అవకాశాలు మెరుగుపరిచేందుకు కృషి చేస్తున్నట్లు ప్రిన్సిపాల్ అశోక్‌నాయక్ తెలిపారు. ఇందులో భాగంగానే శుక్రవారం పాఠశాలలో సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో 12 రోజుల వర్క్ ఇంటర్న్‌షిప్‌ను అప్పెరల్స్ ట్రేడ్‌పై ప్రారంభించామన్నారు. ఒకేషనల్ ట్రైనర్ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో విద్యార్థులకు టైలరింగ్, ఎంబ్రాయిడర్, ఫ్యాషన్ డిజైనింగ్‌పై శిక్షణ ఇస్తున్నామనిచెప్పారు.

రేపు అగళి సంత ప్రారంభం

అగళి: కోవిడ్ కారణాల రీత్యా నిలిచిపోయిన అగళి సంతను ఆదివారం పునః ప్రారంభిస్తున్నట్లు సర్పంచ్ లక్ష్మమ్మ, పంచాయతీ కార్యదర్శి రంగనాథ్ తెలిపారు. కూరగాయలు, నిత్యావసరాలు, పశువుల సంత తదితర వస్తువులను నిర్వహించేందుకులు రైతులు సహకరించాలని కోరారు. సంత నడుపుకునేందుకు వ్యాపారస్తుల నుంచి తాత్కాలికంగా ఎలాంటి సుంకం వసూలు చేయబోమన్నారు. ఇప్పటికే ఈ విషయంపై అన్ని గ్రామాల్లో దండోరా వేయించామని పేర్కొన్నారు.

అస్వస్థతకు గురైన జింక



చిలమత్తూరు: మండలంలోని ఎస్ ముద్దిరెడ్డిపల్లి గ్రామ పొలాల్లో అస్వస్థతకు గురై పడిపోయిన జింకను స్థానికులు ఫారెస్ట్ అధికారులకు అప్పగించారు. వివరాల్లోకెళితే.. శుక్రవారం ముద్దిరెడ్డిపల్లికి చెందిన బాలాజీ పొలం పనులకు వెళ్లాడు. అయితే పొలంలో జింక పడి ఉండటాన్ని గమనించి స్పెషల్ బ్రాంచి జమేదారు జయరామ్ నాయక్‌కు సమాచారం ఇచ్చారు. ఆయన వీఆర్‌ఓ , ఫారెస్ట్ అధికారులకు సమాచారం ఇవ్వగా వారు అక్కడికి చేరుకొని జింకను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. జింకకు కళ్లు కనిపించక , అస్వస్థతకు గురై పడిపోయినట్లు ఫారెస్ట్ అధికారులు తెలిపారు.

డెంగీ నివారణపై అవగాహన


దోమల నివారణకు మందు పిచికారీ చేయిస్తున్న వైద్య సిబ్బంది

అగళి: మండల పరిధిలోని హెచ్‌డీ హళ్లి పంచాయతీలోని వడ్రహట్టి గ్రామంలో శుక్రవారం సబ్ యూనిట్ అధికారి షమీవుల్లా ఆధ్వర్యంలో డెంగీ, మలేరియా నివారణకు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లతో కలిసి గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. దోమల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను సబ్ యూనిట్ అధికారి షమీవుల్లా తెలియజేశారు. వైద్యులు శివనంద, గాయత్రి, ఆరోగ్య కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

రొద్దం ఏఓగా రామ్‌కుమార్



రొద్దం: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఏఓ (అడ్మిస్ట్రేషన్ ఆఫీసర్)గా రామ్‌కుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. చిలమత్తూరులో ఏఓగా విధులు నిర్వహిస్తున్న ఆయన ఇక్కడికి ఏఓగా బదిలీపై వచ్చారు.

గణపతి లడ్డూ @ రూ.లక్ష


లడ్డూ ప్రసాదాన్ని మోస్తున్న భక్తుడు దేవరాజ్

పావగడ: పట్టణంలోని మధుగిరి ఊరు వాకిలి ప్రాంతంలో అశ్వర్థం కట్ట మీద స్థానిక విశ్వ హిందూ పరిషత్, భజరంగ దళ ఆధ్వర్యంలో ప్రతిష్టించిన హిందూ మహా గణపతి లడ్డూ ప్రసాదం వేలం శుక్రవారం జోరుగా సాగింది. పలువురు భక్తులు వేలం పాటలో పాల్గొన్నారు. చివరకు స్థానిక ఎన్‌బీకే అభిమానుల సంఘం అధ్యక్షుడు, శాంతి మెడికల్స్ యజమాని దేవరాజ్ అత్యధికంగా వేలం పాట పాడి 5 కేజీల 250 గ్రాముల లడ్డు ప్రసాదాన్ని రూ.1.08 లక్షలకు దక్కించుకున్నారు. తమ ఆరాధ్య దైవమైన వినాయకుడి లడ్డు ప్రసాదం వేలంలో దక్కించుకోవడం అదృష్టంగా భావిస్తున్నానని పేర్కొన్నారు.

పడకేసిన పాలన

- సోమందేపల్లిలో రెవెన్యూ సిబ్బంది కరువు
- తహసీల్దార్, ఆర్‌ఐ, వీఆర్‌ఓల కొరత
- పనులు కాకపోవడంతో అవస్థలు పడుతున్న ప్రజలు


సోమందేపల్లి తహసీల్దార్ కార్యాలయం

సోమందేపల్లి: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ సిబ్బంది కొరత పట్టిపీడిస్తుండటంతో పాలన పడకేసింది. రెగ్యులర్ తహసీల్దార్‌తో పాటు డిప్యూటీ తహసీల్దార్, ఇద్దరు ఆర్‌ఐలు, 8 మంది వీఆర్‌ఓలు, ఒక సీనియర్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వివిధ ధ్రువీకరణ పత్రాలు, సమస్యలు పరిష్కారం కాకపోవడంతో నానా అవస్థలు పడుతున్నారు. వెంటనే తహసీల్దార్‌తో పాటు రెవెన్యూ సిబ్బందిని నియమించాలని ఉన్నతాధికారులను వేడుకుంటున్నారు.

తహసీల్దార్ నియామకం ఎప్పుడో?

ఎన్నికల విధులకు వచ్చిన తహసీల్దార్ అంజనాదేవి మూడు నెలల క్రితం బదిలీ అయ్యారు. అయితే అప్పటి నుంచి రెగ్యులర్ తహసీల్దార్‌ను ఇక్కడ నియమించలేదు. రెవెన్యూ సేవలు అందడంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. 1బీ, అడంగల్, కుల ధ్రువీరణ పత్రాల కోసం రోజుల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితి. కొద్దిరోజుల క్రితం ఇన్‌చార్జి తహసీల్దార్‌గా డిప్యూటీ తహసీల్దార్ గంగాశంకర్‌ను నియమించారు. అయితే ఆయన కూడా బదిలీ అయ్యారు. ఈ నేపథ్యంలో మండల రెవెన్యూ అధికారి కొరత ఏర్పడింది. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (స్పందన) కార్యక్రమం సక్రమంగా జరగడం లేదన్న విమర్శలున్నాయి. వచ్చే అర్జీలను పెండింగ్ పెడుతూ రెగ్యులర్ తహసీల్దార్ లేరన్న సాకులు చెబుతూ సిబ్బంది కాలం గడుపుతున్నారని అర్జీదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా తాజాగా ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా రెడ్డి శేఖర్‌ను నియమించారు. ఆయన బాధ్యతలు స్వీకరించారు. అయితే రెగ్యులర్ తహసీల్దార్‌ను నియమిస్తేనే అన్ని సమస్యలు పరిష్కారమవుతాయని ప్రజలు చెబుతున్నారు.

ఆర్‌ఐ, వీఆర్వోలు లేక ...

మండలంలోని 16 పంచాయతీలు ఉండగా 14 గ్రామ సచివాలయాలు ఉన్నాయి. ఎనిమిది మంది దాకా వీఆర్వో పోస్టులు ఖాళీ ఉన్నాయి. డిప్యూటీ తహసీల్దార్, రెండు ఆర్‌ఐ, ఓ సీనియర్ అసిస్టెంట్ పోస్టు కూడా ఖాళీగా ఉన్నాయి. ఇక్కడ పనిచేసే జూనియర్ అసిస్టెంట్ లేక కంప్యూటర్‌పై అవగాహన ఉన్న వీఆర్వోలే ఆర్‌ఐ రిపోర్ట్‌లు సిద్ధం చేసుకోవాల్సిన పరిస్థితి. కోర్టు కేసులకు సంబంధించిన నివేదికలు అందించాలంటే పెనుకొండ, హిందూపురం వెళ్లి ప్రైవేటు నెట్ సెంటర్‌లకు వెళ్లి సిబ్బంది టైపింగ్ చేయించుకొని వస్తున్నట్లు తెలిసింది.

కుంటుపడిన పాలన

కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత రెగ్యులర్ తహసీల్దార్ లేకపోవడంతో రెవన్యూశాఖ సేవలు కుంటుపడ్డాయి. కొంతమంది వీఆర్వోలు కూడా సచివాలయాలకు వెళ్లకుండా ఇష్టారాజ్యంగా విధులు నిర్వహిస్తున్నారన్న విమర్శలున్నాయి. మరికొందరు తహసీల్దార్ కార్యాలయానికి పరిమితం అవుతుండడంతో సుదూర ప్రాంతాల నుంచి ప్రజల అవస్థలు పడి మండల కేంద్రానికి వస్తున్నారు. ఇప్పటికైనా రెగ్యులర్ తహసీల్దర్‌తో పాటు సిబ్బందిని నియమించాలని ప్రజలు కోరుతున్నారు.

సమస్యలు పరిష్కరించేవారేరీ?



మండలంలో గత మూడు నెలలుగా రెగ్యులర్ తహసీల్దార్ లేక ప్రజలకు రెవెన్యూశాఖ సేవలు సక్రమంగా అందడం లేదు. ఉన్న ఇన్‌చార్జ్ తహసీల్దార్ బదిలీ అయ్యారు. ఆర్‌ఐలు, వీఆర్వోల కొరత ఉంది. సుదీర్ఘ సమస్యలపై కార్యాలయానికి వెళితే రెగ్యులర్ తహసీల్దార్ రాలేదు. అప్పటి వరకు మీ పనులు జరగవు అని చెబుతున్నారు.
– బిస్త నాగభూషణం, సోమందేపల్లి

ప్రజలు ఇబ్బంది పడకుండా చూస్తాం



సోమందేపల్లికి రెగ్యులర్ తహసీల్దార్ లేని మాట వాస్తవమే. నేనొచ్చి వారం రోజులే అయింది. ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా రెడ్డి శేఖర్‌ను నియమించాము. ఆర్‌ఐ, వీఆర్‌ఓల కొరతకు సంబంధించి ఉన్నతాధికారులను సంప్రదించి ప్రజలకు సమస్య లేకుండా చర్యలు చేపడతాం.
– ఆనంద్ కుమార్, ఆర్డీఓ, పెనుకొండ

ఇసుక సరఫరా పారదర్శకంగా జరగాలి


సీనియర్ అసిస్టెంట్‌కు వినతిపత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు

చిలమత్తూరు: ఉచిత ఇసుక విధానం పారదర్శకంగా అమలు చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం వారు మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. సహజవనరు అయిన ఇసుక రాష్ట్రం దాటిపోతోందని, వెంటనే అరికట్టాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి చూపాలని, నిర్మాణ రంగాన్ని ప్రోత్సహించాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్, సీపీఎం మండల కార్యదర్శి వెంకటేష్, రామచంద్ర, నాయకులు పాల్గొన్నారు.

గోరంట్ల: ఉచిత ఇసుక హామీని వెంటనే అమలు చేయాలంటూ భవన నిర్మాణ, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ముందు కార్మికులు ధర్నా చేశారు. అనంతరం తహసీల్దార్ మారుతీకి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వ్యకాసం జిల్లా ఉపాధ్యక్షుడు ఆంజినేయులు, స్వర్ణలత, కొండ వెంకటేశులు, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

గుడిబండ: మండల పరిధిలోని దాసరపల్లి గ్రామ శివారల్లో శుక్రవారం పేకాట స్థావరంపై మడకశిర సీఐ రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో దాడిచేసినట్లు ఏఎస్‌ఐ చంద్రశేఖర్ తెలిపారు. నలుగురిని అదుపులోకి తీసుకోగా.. ఏడుగురు పరారైనట్లు చెప్పారు. వారి వద్ద నుంచి రూ. 27,080 నగదు, మూడు ద్విచక్ర వాహనాలు, ఐదు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

- వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప



మడకశిరరూరల్: రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం రైతు సంక్షేమాన్ని విస్మరించి వారిని కష్టాల్లోకి నెట్టిందని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప విమర్శించారు. ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను 100 రోజులు అయినా అమలు చేయకుండా అన్ని వర్గాల ప్రజలను మోసం చేస్తోందన్నారు. ఈమేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబుకు రైతుల పట్ల ఏ మాత్రం చిత్తశుద్ధి లేదన్నారు. అప్పులు చేసి సాగు చేసిన వేరుశనగ పంట వర్షాభావ పరిస్థితుల కారణంగా తీవ్రంగా నష్టపోయిన రైతులను అన్ని విధాలుగా అదుకోవాలని డిమాండ్ చేశారు. ప్రతి రైతుకు రూ.20 వేల రైతు భరోసా ఇస్తామని చెప్పి నేటికీ రైతులకు పైసా కూడా ఇవ్వాలేదన్నారు. గతంలో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతు సంక్షేమానికి అధిక ప్రాధాన్యత కల్పించి రైతుకు అండగా నిలిచారని గుర్తు చేశారు. చంద్రబాబు మోసాలు, మాయమాటలను ప్రజలు గమనిస్తున్నారన్నారు. ఇప్పటికైనా చంద్రబాబు సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే రైతులు, ప్రజల పక్షాన వైఎస్సార్‌సీపీ పోరాటం చేస్తుందన్నారు.

విషపు మొక్కలు తిని 10 మేకల మృతి


మృతి చెందిన మేకలు

రొళ్ల: మండల పరిధిలోని హనిసేకుంట గ్రామంలో శుక్రవారం విషపు మొక్కలను తిని 10 మేకలు మృత్యువాత పడ్డాయి. వివరాల్లోకి వెళితే హనిసేకుంటకు చెందిన రాజన్న, రవికుమార్‌తో పాటు గోవిందప్ప ముగ్గురు మేకలు పెంచుతూ దాని ద్వారా వచ్చే ఆదాయంతో కుటుంబాన్ని పోషించుకుని జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో ముగ్గురు మేకల మందను మేత కోసం గ్రామపొలి మేరకు ఉదయాన్నే తీసుకెళ్లారు. సాయంత్రం వరకు మేత మేయించుకుని ఇంటికి వచ్చే దారిలో రోడ్డు పక్కన ఉన్న ఏవేవో విషపు పిచ్చి మొక్కలు తిన్నాయి. ఇంటికి వద్దకు వచ్చే సరికి ఉన్నఫళంగా ఒకదాని తర్వాత ఒకటి మృత్యువాత పడ్డాయని బాధితులు తెలిపారు. దీంతో సుమారు రూ.1.20 లక్షల వరకు నష్టం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం కాపర్లను ఆదుకోవాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు.

జయమంగళి నదికి వరద


పాయకట్ట నుంచి పరిగి చెరువుకు వరద నీరు వెళ్తున్న దృశ్యం

పరిగి: ఎగువన ఉన్న కర్ణాటక రాష్ట్రంలోని ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల కారణంగా మండలంలోని జయమంగళి నదికి వరద ప్రవాహం పోటెత్తుతోంది. శుక్రవారం ఉదయం నుంచి పరిగి మండలంలోకి నీరు ప్రవేశించడంతో మండలంలోని రైతులు, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నదీ జలాలను తిలకించేందుకు ప్రజలు ఆసక్తి కనపరిచారు. కాగా పరిగి మండలంలో గురువారం రాత్రి 45.4 మి.మీటర్ల వర్షపాతం నమోదైంది.

రోడ్డు ప్రమాదానికి కారణమైన వ్యక్తిపై కేసు నమోదు

పరిగి: రెండు ద్విచక్ర వాహనాల ఢీకొన్న ఘటనలో నిర్లక్ష్యంగా వాహనాన్ని నడిపి ప్రమాదానికి కారణమైన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ హిదాయతుల్లా తెలిపారు. ఆయన వివరాలమేరకు.. రెండు రోజుల క్రితం మండలంలోని ఎర్రగుంటకు చెందిన శివయ్య ద్విచక్ర వాహనంపై వస్తుండగా శ్రీరంగరాజుపల్లికి చెందిన భానుప్రకాష్ ద్విచక్ర వాహనంపై వేగంగా వచ్చి శివయ్య వాహనాన్ని ఢీకొట్టాడు. తీవ్రంగా గాయపడిన శివయ్యను ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రుడి భార్య అంజినమ్మ ఫిర్యాదు మేరకు భానుప్రకాష్‌పై కేసు నమోదు చేశామని ఏఎస్‌ఐ తెలిపారు.

ద్విచక్ర వాహనానికి నిప్పు


కాలిపోయిన ద్విచక్ర వాహనం

లేపాక్షి: మండల పరిధిలోని బిసలమానేపల్లికి చెందిన చంద్రశేఖర్ అనే వ్యక్తికి చెందిన ద్విచక్ర వాహనానికి (హోండా షైన్) దుండగులు గురువారం రాత్రి నిప్పుపెట్టారు. అర్ధరాత్రి సమయంలో పెట్రోలు పోసి నిప్పుపెట్టడంతో రూ.70 వేలకు పైగా నష్టం వచ్చిందని బాధితుడు వాపోయారు. ఈ విషయంపై స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు.

పీహెచ్‌సీకి ప్రహరీ నిర్మించరూ..


కదిరేపల్లి పీహెచ్‌సీకి పహరీ లేని దృశ్యం

మడకశిర రూరల్: మండల పరిధిలోని కదిరేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ప్రహరీ నిర్మించి విషపురుగుల ప్రవేశించకుండా చూడాలని గ్రామాల ప్రజలు కోరుతున్నారు. పీహెచ్‌పీ కొండ సమీపంలో ఉండడంతో విషపురుల బెడద అధికంగా ఉందన్నారు. గతంలో ఈ విషయాన్ని వైద్యసిబ్బంది జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి కూడా తీసుకెళ్లినా ఫలితం లేదన్నారు. ఇప్పటికైనా ప్రహరీ నిర్మించాలని కోరారు.

అంతా మా ఇష్టం

- రోడ్డు పక్కన చెట్లు నరికి సొమ్ముచేసుకున్న కూటమి నాయకులు
- చోద్యం చూస్తున్న అధికారులు


గోళాపురం మలుపు దారిలో జేసీబీతో చింతచెట్టు కూల్చివేసిన దృశ్యం

హిందూపురం: అధికారం ఉంది కదా అని కూటమి నేతలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఆఖరికి రోడ్డు పక్కన ఉన్న చెట్లను నరికివేస్తూ జేబులు నింపుకుంటున్నారు. వివరాల్లోకెళితే.. తూమకుంట చెక్ పోస్టు బెంగళూరు రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఏళ్ల నాటి 8 చింత చెట్లను టీడీపీ, బీజేపీ నాయకులు గత రెండురోజులు జేసీబీలతో తొలగించారు. చెట్టు కొమ్మల అడ్డు తొలగిస్తామని ఆర్‌అండ్‌బీ ఏఈకి చెప్పి చింతచెట్లను నెలకూల్చేశారు. ఏదేమిట ప్రశ్నించిన అక్కడి వారికి ఏఈకి చెప్పే చేశామని దురుసుగా మాట్లాడటం వారు నిమ్మకుండిపోయారు. కొట్టేసిన చెట్లను అమ్ముకుని సొమ్ముచేసుకోవడం హేయమని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పెద్ద పెద్ద చెట్లను జేసీబీలతో తొలగిస్తున్నా అధికారులు ఎవరూ నోరెత్తకపోవడం గమనార్హం.

అనుమతులు తీసుకోలేదు

చెట్ల తొలగింపుపై ఫారెస్ట్ రేంజర్, ఆర్‌అండ్‌బీ ఏఈ మోహన్‌లకు 'సాక్షి' వివరణ కోరగా తమకు ఎలాంటి సమాచారం ఇవ్వలేదన్నారు. ఇలా వరుసగా చెట్ల నరికి వేయడం మాత్రం నేరమన్నారు. దీనిపై తాము రూరల్ పోలీసులకు ఫిర్యాదు ఇచ్చామని, చర్యలు తీసుకుంటామని చెప్పారు.


హిందూపురం: బాలాత్రిపుర సుందరిగా చౌడేశ్వరిదేవి


హిందూపురం: బ్రహ్మచారిణిగా దర్శనమిస్తున్న లక్ష్మీదేవి


హిందూపురం: కూర్మావతారంలో పేట వేంకటరమణస్వామి

గాయత్రీదేవీ నమోస్తుతే !

సాక్షిబృందం: శరన్నవత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. శుక్రవారం హిందూపురం, పెనుకొండ, మడకశిర నియోజకవర్గాల్లోని అన్ని ఆలయాల్లో అమ్మవార్లు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనం ఇచ్చారు. భక్తులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.


చిలమత్తూరు: గాయత్రీదేవిగా దర్శనమిస్తున్న చౌడేశ్వరీదేవి


మడకశిర: నాగవల్లి అలంకరణలో కన్యకాపరమేశ్వరి


పెనుకొండ: గాయత్రీదేవిగా మహేశ్వరీదేవి


రొద్దం: గాయత్రీదేవిగా రేణుకా యల్లమ్మదేవి


మడకశిర: పసుపు కుంకుమ అలంకరణలో వీరకేతమ్మ


లేపాక్షి: గాయత్రీదేవి అలంకరణలో దుర్గాదేవి

దంచికొట్టిన వాన


చిలమత్తూరులో కురుస్తున్న వర్షం

చిలమత్తూరు: మండలంలో పలుచోట్ల శుక్రవారం సాయంత్రం వాన దంచికొట్టింది. ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఖరీఫ్ పంట కోత దశలో ఉండటంతో నష్టం వాటిల్లే ప్రమాదముందని రైతులు ఆందోళన చెందుతున్నారు.


పొంగిపొర్లుతున్న శ్యాన బోగుల వాగు

బెల్లిబట్లులో...

పావగడ: తాలూకాలోని నిడుగల్ దుర్గం బెల్లిబట్లు పరిసర ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తున్నారు. కేటీ హళ్లికి వెళ్లే మార్గంలో ఉన్న శ్యాన బోగుల వాగు పొంగిపొర్లుతూ చెరువులోకి చేరుతోంది. దీంతో చెరువు జలకళను సంతరించుకుంది.

కియా పోలీసుస్టేషన్ ఎస్‌ఐగా రాజేష్



పెనుకొండ రూరల్: కియా పోలీస్‌స్టేషన్ నూతన ఎస్‌ఐగా ఎం.రాజేష్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా పెనుకొండ పట్టణ పోలీస్‌స్టేషన్ నుంచి కియా పోలీస్‌స్టేషన్‌కు ఆయన బదిలీ అయ్యారు. బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆయన విలేకరులతో మాట్లాడారు. శాంతిభద్రతలు, రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రత్యేక దృష్టిసారిస్తామన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు చెక్ పెడతామని వెల్లడించారు.

ట్రాన్స్‌కో ఏఈగా నిజాముద్దీన్

రొళ్ల: స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్‌లో శుక్రవారం ఇన్‌చార్జ్ విద్యుత్‌శాఖ ఏఈగా నిజాముద్దీన్ బాధ్యతలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా విద్యుత్ కొరత లేకుండా చర్యలు తీసుకుంటామని, సమస్యలు ఉంటే తమను సంప్రదించాలని సూచించారు.

చిలమత్తూరు ఏఓగా రమణమూర్తి


ఏఓ రమణమూర్తికి స్వాగతం పలుకుతున్న సిబ్బంది

చిలమత్తూరు: మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఏఓగా రమణమూర్తి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈ మేరకు ఆయనకు సచివాలయ సిబ్బంది, కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. ఇక్కడ ఏఓగా విధులు నిర్వర్తించిన రామ్‌కుమార్‌కు సిబ్బంది ఘనంగా వీడ్కోలు పలికారు. ఇదిలా ఉండగా కోడూరు పంచాయితీ కార్యదర్శిగా భాస్కర్ బాధ్యతలు స్వీకరించారు. ఇక.. మండల ఎంపీడీఓ నరేష్‌కృష్ణ పెనుకొండ ఎంపీడీఓగా బదిలీపై వెళ్లారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

పావగడ: తాలూకా వ్యాప్తంగా వచ్చే ఆరు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. తాలూకా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని స్థానిక తహసీల్దార్ వరదరాజు ఓ ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే తుమకూరు జిల్లాలో ఎల్లో అలర్ట్ ప్రకటించారన్నారు. అది మనకు కూడా వర్తిస్తుందన్నారు. అత్యవసర సేవల కోసం పట్టణంలోని తాలూకా కార్యాలయంలో సహాయ వాణి కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. వర్షాల నుంచి ఎలాంటి ప్రమాదం జరిగినా సెల్‌నంబర్ 08136244242కు ఫోన్ చేయాలన్నారు. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో ఎవరూ విద్యుత్ స్తంభాలు, చెట్ల కింద ఉండకూడదన్నారు.

తపాలా ఉద్యోగుల సహాయ నిరాకరణ

గోరంట్ల: స్థానిక సబ్‌పోస్టు ఆఫీసు పరిధిలోని తపాలా ఉద్యోగులు డిమాండ్ల సాధన కోసం శనివారం సహాయ నిరకరణకు దిగారు. కేంద్ర ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఏఐజీడీఎస్ నాయకులు లక్ష్మారాంనాయక్, శోభన్ బాబు వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి

హిందూపురం: కదిరి ఆర్టీసీ డిపో నుంచి హిందూపురం డిపో ట్రాఫిక్ ఇన్‌చార్జిగా బదిలీపై వచ్చిన డీవీ నారాయణ శుక్రవారం బాధ్యలు స్వీకరించారు. నేషనల్ మజ్దూర్ యూనియన్ అసోసియేషన్ డిపో కమిటీ సభ్యులు ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం కార్మికుల ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరారు. రంగనాథ్, రాజారెడ్డి, టీఎస్ నాథ్, కిరణ్, వలిసాబ్ తదితరులు పాల్గొన్నారు.